కథ

# బర్డ్ ఫ్లూ

సూరేపల్లి విజయ




కొక్కొరోకో...
ఆ కూత వినగానే
కళ్ళు నులుముకుని,
నిద్ర లేచి చిన్నాచితక పనులతో
దైనందిన కార్యక్రమాలు
మొదలు పెట్టాలి. అది క్వైట్ కామన్.
పాలవాడు పాలు అని అరుస్తాడు.
పేపర్ బాయ్ పేపర్ అని గిరాటు వేసి
వెళ్తాడు. అలారం గడియారాలు
లేని యుగంలోను అలారం పెట్టినట్టు
కోడికూత పెట్టి నిద్రలేపడం గ్రేటుల్లో
గ్రేటెస్ట్.. బెస్ట్‌ల్లో బెస్ట్ కదా..
కోడికి తెలిసిన టైం సెన్స్ టైం పంక్చు
వాలిటి మరెవ్వరికీ తెలియదని మన
నమ్మిక కదా..
కోడి కొక్కొరోకో అని కూయగానే
ఆనందంలో నిద్రలేవడానికి బదులు,
ఆ కోడి కూతను తుఫానుకు
ఇండికేటర్‌లా, సునామీకి వార్నింగ్‌లా,
ఫైరింజన్ సౌండ్‌లా భయపడి
వీధి వీధంతా తట్టా,బుట్టా సర్దుకుని
పరుగెత్తినంత పనిచేసారు.
కొందరు ధైర్యస్తులు అధైర్యంగానే
కూసిన కోడిని ట్రేస్ చేయడానికి
కర్రలు గట్రా పట్టుకుని వెతుకులాట
మొదలు పెట్టారు. వెతికి పట్టుకుని
వండుకు తినడానికి కాదు.
కోడి తల మీద ఒక్కటిచ్చి
పూడ్చిపెట్టడానికి.
కారణం..బర్డ్‌ఫ్లూ.

కొన్ని కోళ్ళు సమావేశమై పిచ్చాపాటీ మాట్లాడుకుంటూ నవ్వుకుంటున్నాయి. ''చూశారా ఫ్రెండ్స్.. ఇన్నాళ్లూ మనల్ని వెంటాడి కోసుకుని నంజుకుని తినే మనుష్యులు మనల్ని చూసి ఎలా భయపడిపోతున్నారో.. చివరికి మన గుడ్లు, పిల్లల్ని కూడా విడిచిపెట్టకుండా ఉడికించి, ఆమ్లెటు వేసుకుని మరీ తినేవాళ్ళు..'' ఓ కోడి కొక్కొరోకో అని నవ్వి చెప్పింది. మిగతా కోళ్ళు నవ్వాయి. ఓ కోడి మాత్రం విషాదంగా ''చంపుకు తినట్లేదని సంబరపడిపోతున్నాం గానీ.. బర్డ్ ఫ్లూ సోకిందని మనల్ని ప్రాణాలతో కూడా పూడ్చిపెడుతున్నారు. ఇప్పుడే పేపర్లో ఓ వార్త చదివాను. గుజరాత్‌లోని సూరత్ జిల్లా ఉచల్ తాలుకాలో అరవై వేల సోదరులను(కోళ్ళ) చంపి పూడ్చిపెట్టారట. మనల్ని అమ్మకూడదని రైల్వేలు, పార్లమెంటు, క్యాంటీన్‌లు డిసైడ్ చేసాయిట..మన పసిగుడ్డులను కూడా దశలోనే నలిపి వేసారట'' చెప్పింది.

''అబ్బా..అయితే ఏమిటి నీ నస?''మరో కోడి పుంజు చికాగ్గా అడిగింది.

''మనల్ని చంపినా, మనుష్యులకు ఆహారమైపోతున్నామన్నా తృప్తి..కానీ పూడ్చి పెడితే ఎందుకూ పనికి రాముకదా..''

''భలే వారే.. తమాషా చూస్తుండు.'' అంది ఇంకో కోడి పెట్ట..

* * *

అది పగల సెగల జోన్.

''రేయ్..తీయండ్ర సుమో.. వేయండ్ర ఆయుధాలు'' ఓ ఫ్యాక్షనిస్టు చొక్కాని పైకి మడిచి చెప్పాడు.

వెంటనే రక్తాన్ని యూనిఫామ్ గుడ్డల్లా వేసుకుని శాల్తీలు, కత్తులు, కటార్లు, బాంబులు, ఏకేఫాటీసెవెన్లు సుమో డిక్కీ తెరచి అందరూ వేసేసారు.

అందరికంటే పెద్ద తలకాయ అక్కడికి వచ్చి డిక్కీలో వున్న ఆయుధాలను చూసి..''రేయ్ ..నేను చెప్పిందేమిటి ? మీరు చేసిందేమిట''ని హుంకరించాడు.

''మీరు చెప్పింది చేసాం అన్నా..కత్తర్నాక్ ఆయుధాలన్నా, నిన్ననే సాన పట్టించాం'' చెప్పాడొకడు భయం భయంగా.

''అరె..తు.. ఆయుధాలు కాదురా.. కోళ్ళఫారంలో వున్న ఆయుధాలురా''

''అంతకన్నా పెద్ద ఆయుధాలేం కావాలిరా. వాటిని తీసుకొచ్చి కోడి మాంసం వండుండ్రి''

''ఎందుకన్నా.. ఎవరికన్నా పార్టీ ఇస్తున్నావా.. అయినా యివ్వాళ ఎక్స్‌పార్టీ వాడ్ని వేసేయాలి కదన్నా''

''అందుకేరా కోడిమాంసం వండమని చెప్పిన మసాలాలు దట్టించండ్రి. ఆ మాంసాన్ని ఎగస్ పార్టీ వాడికి తినిపించండ్రి.. దెబ్బకు చచ్చుర్కుంటాడు''

''అదెలా అన్నా.. శత్రువులకు కోడికూర పెట్టాలా అన్నా''

''పెట్టాలిరా.. ఎందుకంటే ఆ కోడికూర తిని వాళ్ళు ఛస్తారు''

''ఎలా అన్నా''

''బర్డ్ ఫ్లూ రా..బర్డ్‌ఫ్లూ'' నవ్వాడు ఫ్యాక్షనిస్టు.

* * *

''ఒసే..నేను నీకేం చెప్పానే. పుట్టింటికి వెళ్ళి లక్ష తీసుకురమ్మని చెప్పిన, నన్ను లక్ష్యపెట్టవటే'' మొగుడు గారు హుంకరించి, ఘీంకరించి, చివరికి భౌభౌమని పెళ్ళాని కరిచేస్తున్నాడు.

''నేను లక్ష రూపాయల కోసమే మా పుట్టింటికి వెళ్ళానండీ..లక్షొత్తుల నోము నోచుకో.. నీ కట్నాల పిచ్చి మొగుడికి బుద్ధొస్తుంది అని లక్షొత్తులు ఇచ్చి పంపించారండీ'' దీనంగా అని కసుక్కున నవ్వి చెప్పింది భార్యామణి.

''లక్షతోనే ఈ ఇంటి గడప తొక్కాలని చెప్పానా.. లేదా.. నాకు అన్నం వండి వడ్డించి తగలబెట్టి పుట్టింటికి వెళ్ళు.. లక్షతో రాకపోతే విడాకులతో మీ ఇంటికి వెళ్తావ్''

ఆ భార్యామణి ఏడుస్తూ కిచెన్‌లోకి వెళ్ళి అర గంటలో వంట పూర్తి చేసి, భోజనం డైనింగ్ టేబుల్ మీద పెట్టి , పెట్టే బేడ సర్దుకుని చివరిసారి భర్తకు అన్నం వడ్డించి కూర వడ్డించింది.

ప్లేటులోని కూరని చూడగానే కెవ్వున కేకవేసి ఎగిరి గంతేసి వణికిపోయాడు మొగుడుగారు.

''ఇదేంటే''

''కోడికూరండి. మా నాన్నగారు మీ కోసం ఇచ్చారండి. మంచి నాటుకోడి అల్లుడిగారికి వండి పెట్టు అని చెప్పారండి. అన్నట్టు చెప్పడం మరిచిపోయానండీ..ప్రతి ఆదివారం మీ కోసం ఓ నాటుకోడిని పంపిస్తానని చెప్పమన్నారండి''

''ఓసి నీ ప్రేమ తగలడ..మీ నాన్న అభిమానం సునామీలా తగలెయ్య..ముందా ప్లేటు తీసి అవతల పారేయ్''

''అదేంటండీ.. మీకు కోడికూర అంటే ఇష్టం కదా.. సాయంత్రం కోడిగుడ్డు అట్టు కూడా వేసిద్దామనుకున్నానే'' మొగుడి రియాక్షన్ చూస్తూ అడిగింది.

''నీకు దండం పెడతానే..ముందా ప్లేటు తీసెయ్''

''మరి నేను మా పుట్టింటికి వెళ్ళి రూపాయలు తీసుకురావాలి కదండీ..మాయింటి నుంచి వచ్చిన ఆ ప్లేటు తీసేస్తాన్లేండి'' అంది ముక్కు చీది.

''లక్షా వద్దు, పాడు వద్దు. నువ్వెక్కడికి వెళ్ళొద్దు. ముందా కోడికూర తీసెయ్'' అంటూ ఇంకా ఆ జీవుడు వణికిపోతూనే వున్నాడు.

కారణం బర్డ్ ఫ్లూ.

* * *

అది పోలీస్ స్టేషన్. అందులో ఓ ఇంటరాగేషన్ సెల్. అక్కడ ఉగ్రవాది.

''నిజం చెప్పు .. రైల్వే స్టేషన్‌లో బాంబు పెట్టావా లేదా?''చెమటలు కక్కుతూ పదే పదే లాఠీని చేతిలోకి తీసుకుని అడిగాడా ఇంటరాగేషన్ ఆఫీసర్.

రెండు గంటలుగా ఆ ఉగ్రవాదిని ఇంటరాగేట్ చేస్తున్నా ఆ ఉగ్రవాది తెలుగు ట్రాజెడీ సినిమానో, డైలీ సీరియల్లో చూసినట్టు విలాసంగా నవ్వుతూనే వున్నాడు తప్ప ఒక్క ముక్క కూడ మాట్లాడటం లేదు. నేలమీద తొమ్మిది విరిగిన లాఠీలు వున్నాయి. ఉగ్రవాది ఒంటి మీద వాటి తాలుకూ దెబ్బలు వున్నాయి.

''అరె..నిజం చెప్పరా.చచ్చి నీ కడుపున పుడతాను. ఆ బాంబును ఎక్కడపెట్టి చచ్చావో చెప్పు. లేకపోతే బోలెడు మంది చచ్చిపోతార్రా'' చివరికి దీనంగా అడిగాడు.

''నేను చెప్పనుగాక చెప్పను'' నా బాడీతో ఇష్టం వచ్చినట్టు కబడ్డీ ఆడుకో అన్న లెవల్లో ఎక్స్‌ప్రెషన్ ఇచ్చాడు.

అప్పుడే టీ కుర్రాడు ఫ్లాస్కు కప్పుతో వచ్చాడు.


ఆఫీసర్ మాటలు విని కసుక్కున నవ్వి ''నన్నో ఐడియా చెప్పమంటారా సార్'' అని అడిగాడు.


''నువ్వా... ఐడియానా''

''అవును సర్.. ఒక ఐడియా జీవితాన్నే మార్చుస్తుంది'' అని ఇంటరాగేషన్ ఆఫీసర్ చెవిని లైట్‌గా కొరికాడు.

* * *

ఉగ్రవాది ఆశ్చర్యంగా చూశాడు. ఇంటరాగే





షన్ ఆఫీసర్ చిద్విలాసంగా నవ్వి.''తిను..నువ్వు పెట్టిన బాంబు పేలడానికి అరగంట టైముంది. ఈలోగా బిర్యానీ తిను''

బిర్యానీ ప్యాకెట్ విప్పి ఆశ్చర్యంగా చూసిన ఉగ్రవాది హాహాకారాలు చేశాడు. అది చికెన్ బిర్యానీ.

''తినరా..నువ్వు నిజం చెప్పకపోయినా ఫర్లేదు. చికెన్ బిర్యానీ మాత్రం తినాల్సిందే. తినకపోతే చికెన్ బిర్యానీని మిక్సీలో వేసి జ్యూస్ చేసి నీతో తాగిస్తాను'' అన్నాడు ఆఫీసర్. అంతే విలవిల్లాడి, గిజగిజ కొట్టుకుని, గలగల మాట్లాడేసాడు. బాంబు ఎక్కడ పెట్టాడో డిటేల్డ్‌గా చెప్పుకొచ్చాడు. కారణం చికెన్ బిర్యానీ..బర్డ్ ఫ్లూ.

సరిహద్దు ప్రాంతం.

బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్ చీఫ్ సైనికాధికారులతో సీరియస్‌గా డిస్కస్ చేస్తున్నాడు.

''డియర్ సోల్జర్స్.. బీ ఎలర్ట్..పొరుగు దేశం స్నేహ హస్తం అంటూనే వామహస్తం అందించి భస్మనీతులు చెబుతోంది. ఉగ్రవాదులను ఉసిగొలుపుతోంది. మన సరిహద్దుల్లోకి చొచ్చుకు వచ్చి కనిపించిన దానినల్లా ఆక్రమించుకోవాలని ప్రయత్నిస్తోంది. మన భూభాగం మీద పూచికపుల్ల కూడా వాళ్ళకు దక్కకూడదు'' ఉద్వేగంగా చెప్పుకుపోతున్నాడు చీఫ్.

ఈలోగా భారతీయ కోళ్ళు బారులు తీరి లోపలికి వచ్చాయి.

''అఫ్‌కోర్స్..మా శరీరాల్లోనూ భారతీయత వుంది. ఇన్నాళ్లూ మీకు కమ్మని భోజనంలా ఉపయోగపడ్డాం ఇప్పుడు దేశభక్తిని చాటుకునే అవకాశం మాకు వచ్చింది. మన సరిహద్దు ప్రాంతాలకు చొచ్చుకు వచ్చి ఆక్రమించుకునే జబ్బు వున్న ఉగ్రవాదులకు మేము సమాధానం చెబుతాం..మాకు ఓ అవకాశం ఇవ్వండి'' అంటూ కోళ్ళు విన్నవించుకున్నాయి.

చీఫ్ కళ్ళు తడిబారాయి. ఆ కోళ్ళకు సెల్యూట్ చేశాడు. కోళ్ళు ఉమ్మడిగా కదిలాయి.

''రేయ్.. ఉదర్ దేఖో.. తెగ బలసిన ఇండియా కోళ్ళు. భలే రుచిగా వుంటాయి. పకడో మారో.. పలావ్ బనో.'' ఉగ్రవాద నాయకుడు తోటి ఉగ్రవాదులకు చెప్పాడు.

కనిపించిన దానినల్లా ఆక్రమించే నీచ ఉగ్రవాదులు సరిహద్దు దాటి దొంగ దెబ్బ తీసి కోళ్ళను పట్టేసి, వాటి పీక నులిమేసి పలావ్ వండేసి, సుష్టుగా తినేసి.. ఆనక అసలు విషయం పసిగట్టేసి హాహాకారాలు మొదలుపెట్టేశారు.

కారణం ఆ కోళ్ళకు సోకిన వ్యాధి..బర్డ్ ఫ్లూ.. శత్రువులను చంపి ఆత్మార్పణ చేసుకున్నాయా భారతీయ కోళ్ళు.

***

ఎక్కడ చూసిన బర్డ్ ఫ్లూ వార్తలే. ఉదయమే కోడికూస్తే జనంలో భయం. ఫ్యాక్షనిస్టులు కోడికూరతో విందు చేస్తే ఎక్స్‌పార్టీ వాళ్ళకు భయం. కట్నం కోసం వేధించే మొగుళ్ళకు పెళ్ళాలు కోడికూర వండిపెడితే భయం.

లాకప్పుల్లో, ఇంటరాగేషన్‌లో ఖైదీలకు చిత్రహింసలకు బదులు కోడి పలావ్‌లు పెడితే భయం. ఆఫీసుల్లో అమ్మాయిలను లైంగికంగా వేధించే బాసులకు సబార్డినేట్ అమ్మాయిలు చికెన్ పార్టీ రెడీ సార్ అంటే భయం.


కనిపించిన దానినల్లా నొక్కేయాలని, ఆక్రమించేయాలని చూసే ఉగ్రవాదులకు భారతీయ కోళ్ళను చూస్తే భయం.

భయం భయం.. బర్డ్ ఫ్లూ భయం.

భారత్‌లో బర్డ్ ఫ్లూ భయం. భారత్‌లో బర్డ్ ఫ్లూ లేదు( ఉంది)..కానీ పై కేటగిరిల్లో వున్న వాళ్ళకు మాత్రం బర్డ్ ఫ్లూ భయం అలానే వుండాలి.

★

## వేలంటైన్స్ రోజెస్



ఆరోజు ఫిబ్రవరి 14. ఓ ముసలతను కలకత్తాలోని ఓ సిటీ బస్‌ని ఎక్కాడు. ఆయన చేతిలో సెలిఫోన్, కాగితంలో చుట్టిన పన్నెండు గులాబీల గుత్తి వుంది. ఆయన ఓ యువకుడి పక్కన కూర్చున్నాడు.

''మీరు ఎవరికో వేలంటైన్స్ డే బహుమతిని తీసుకెళుతున్నట్లున్నారు?'' ఆయన చేతిలోని గులాబీల వంక మెచ్చుకోలుగా చూస్తూ అడిగాడు ఆ యువకుడు.

''అవును'' జవాబు చెప్పాడాయన

కొద్ది క్షణాల పాటు వాటి వంక చూసిన ఆ యువకుడు చిన్నగా నిట్టూర్చడం గమనించాడా ముసలాయన.

''నీకో గర్ల్ ఫ్రెండ్ వుందా?''కాసేపు ఆగి ప్రశ్నించాడాయన.

''ఉంది. ఆమె దగ్గరకే వేలంటైన్ గ్రీటింగ్ కార్డ్‌తో వెళుతున్నాను.''

మరో పదినిమిషాల సేపు ఇద్దరూ నిశ్శబ్దంగా వున్నారు. తన స్టాప్ రాగానే, ముసలాయన బస్ దిగడానికి లేచాడు. రెండడుగులు వేసి ఆగి, వెనక్కి తిరిగి తన చేతిలోని గులాబీ గుత్తిని ఆ యువకుడి ఒళ్లో పెట్టి చెప్పాడు.

''వీటిని మా ఆవిడ కోసం తీసుకువెళుతున్నాను. కానీ, ఆవిడ వీటిని తన బదులు నువ్వే తీసుకోవాలనుకుంటుంది అని నా నమ్మకం. ఇది నీకు ఇచ్చానని ఆమెకి చెప్తాను.''

ఆయన బస్ దిగి వెళ్లిపోయాడు. బస్ కదిలాక ఆ యువకుడు కిటికీలోంచి బయటకి చూస్తే, ఆయన ఓ క్రిస్టియన్. స్మశానం గేటు దాటి లోపలికి వెళుతూ కనిపించాడు.

- మల్లాది